సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 31 । జూలై । 2024



సొమ్ములు అందక.. సాగు సాగక

రబీలో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ఖరీఫ్ సాగు ప్రారంభమైనా ఇప్పటికీ సొమ్ములు చెల్లించకపోవడంతో రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. 8లో ▸



విద్యుత్ ఉద్యోగుల నిరసన

ఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో ఉద్యోగులను బదిలీ చేయడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు ఆందోళనలు చేశారు. 8లో ▸



బెట్టింగ్ ముఠా అరెస్టు

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో మోసం చేస్తున్న ముఠాను అమలాపురం పోలీసులు పట్టుకున్నారు. భీమవరానికి చెందిన ఇద్దరి ఆధ్వర్యంలో ఈ ముఠా నడుస్తోందని గుర్తించారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఉచిత బస్సుతో మా పొట్ట కొట్టొద్దు



భీమవరంలో ర్యాలీ చేస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

భీమవరం: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మా పొట్టలు కొట్టొద్దు.. ఈ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి అంటూ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యింటి సత్యనారాయణ కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని నిరసిస్తూ భీమవరంలో మంగళవారం ఆటో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికుల జీవితాలు అగమ్యగోచరంగా మారే ప్రమాద ముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకునే వరకూ పోరాటాలు చేసేందుకు ఆటో కార్మిక సంఘాలన్నీ ఏకతాటి పైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. భీమవరం ఏఎంసీ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా భారీ ర్యాలీ జరిపి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ భీమవరం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పంపన గోపి, నాయకులు తలారి వాసు, సంజయరావు, సాల్మన్‌రాజు, యిర్రింకి సురేష్, వాసు, అరేపల్లి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కారుపై దాడి జరగలేదు

బుట్టాయగూడెం: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కారుపై ఎలాంటి దాడి జరగలేదని పోలవరం డీఎస్పీ ఎస్.సురేష్‌రెడ్డి స్పష్టం చేశారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రాయి విసరడం వల్ల కారు వెనుక అద్దం పగిలిందంటూ వచ్చిన ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ చేశామని, ఎమ్మెల్యే బాలరాజు ఇంటి వద్ద కారు షెడ్ నిర్మిస్తుండగా.. ఓ సిమెంట్ స్తంభం కారు వెనుక అద్దంపై పడిందని చెప్పారు. అద్దం పగిలిన విషయాన్ని గుర్తించని ఎమ్మెల్యే అనుచరులు.. అదే కారులో జీలుగుమిల్లికి బయల్దేరారు. బర్రింకలపాడు ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ఎదురుగా ఉన్న స్పీడ్ బ్రేకర్ ఎక్కగానే.. అద్దం పగిలి కారులో పడింది. దీంతో ఎవరో వ్యక్తి రాయితో దాడి చేశారనుకొని.. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారుని డీఎస్పీ చెప్పారు.

పెంటపాడులో అత్యధికంగా 40 మి.మీ. వర్షపాతం

భీమవరం: జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకూ 407 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సమాచార శాఖ తెలిపింది. పెంటపాడులో అత్యధికంగా 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా తాడేపల్లిగూడెంలో 39.8, ఉండిలో 39.4, పెనుగొండలో 36.4, ఇరగవరంలో 36, పెనుమంట్రలో 32.6, పోడూరులో 31.2, పాలకోడేరులో 27.4, తణుకులో 24.4, ఆకివీడులో 23.2, ఆచంటలో 19.4, అత్తిలిలో 12.4, కాళ్లలో 15.2, గణపవరంలో 10.2, పాలకొల్లులో 7.6, నరసాపురంలో 6.2, మొగల్తూరులో 2.4, భీమవరంలో 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

72 మంది సిబ్బందికి పదోన్నతులు

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో ఇటీవల 72 మంది పోలీస్ సిబ్బందికి పదోన్నతులు కల్పించినట్లు ఏలూరు రేంజ్ ఐజీ వీజీ అశోక్‌కుమార్ చెప్పారు. పూర్వ ఉమ్మడి జిల్లాల పరిధిలో పోలీస్ సిబ్బందికి పదోన్నతులు కల్పించడంలో రేంజ్ కార్యాలయ మేనేజర్ జీవీ నాగరాజు, రేంజ్ కార్యాలయ సిబ్బంది కృషి అభినందనీయం అన్నారు. ముగ్గురు ఎస్సైలకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా, 36 మంది హెచ్‌సీ, ఏఎస్ఐలు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు పొందారని తెలిపారు. 17 మంది హెచ్‌సీలకు ఏఎస్సైలుగా, ముగ్గురు ఏఆర్ ఏఎస్సైలకు ఆర్ఎస్సైగా, 12 మంది ఏఆర్ హెచ్‌సీలకు ఏఆర్ ఎస్సైలుగా పదోన్నతులు కల్పించామని ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి

భీమవరం: ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఇన్‌చార్జి జిల్లా జేసీ జె.ఉదయ భాస్కరరావు కోరారు. మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ప్రజా పంపిణీ వ్యవస్థపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తూకం మిషన్లు తనిఖీ చేసి, ఏదైనా లోపం ఉంటే వెంటనే మార్చాలని ఆదేశించారు. తూనికలలో తేడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్.సరోజ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మేనేజర్ శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ప్రయాణించాలంటే సామాన్యులు రైలు ప్రయాణాన్నే నమ్ముకునేవారు... ఇప్పుడు ఆ ప్రయాణం చుక్కలు చూపిస్తోంది. జనరల్ బోగీలు, స్లీపర్ బోగీల సంఖ్య తగ్గించడంతో రైలు ప్రయాణం చేయాలంటే కుస్తీలు పట్టాల్సి వస్తోంది. రిజర్వేషన్ చేసుకుందాంటే ఎప్పుడూ వెయిటింగ్ లిస్టే.. ఒకవేళ టికెట్ దొరికితే మన సీట్లో ఎవరో కూర్చుంటారు. చివరకు రైలు ఎక్కాలన్నా, దిగాలన్నా నానా తంటాలు పడాల్సిందే. ఈ క్రమంలో మంగళవారం 'సాక్షి' ఏలూరు రైల్వే స్టేషన్‌లో పరిస్థితిని పరిశీలించింది.



చుక్ చుక్ బండి..

ఎక్కాలంటే చుక్కలే

స్టేషన్: ఏలూరు
సమయం : మధ్యాహ్నం 3.50 గంటలు
రైలు: ఈస్ట్‌కోస్ట్ (హైదరాబాద్-హౌరా)

మంగళవారం మధ్యాహ్నం ఏలూరు స్టేషన్‌కు 3.35 గంటలకు రావాల్సిన ఈస్ట్‌కోస్ట్ 15 నిమిషాలు అలస్యంగా వచ్చింది. ఏలూరు నుంచి వైజాగ్, భువనేశ్వర్ వెళ్లటానికి సుమారు 60 మందికి పైగా ప్రయాణికులు ఉండగా వారిలో సగభాగం మంది జనరల్ బోగీల్లోకి వెళ్లేందుకు నానాతంటాలు పడ్డారు. సమీప ప్రాంతాలైన తాడేపల్లిగూడెం, రాజమండ్రి వెళ్ళేవారు కూడా ఉన్నారు. బాత్‌రూం డోర్ వద్ద, బోగి మొదట్లో ఇరుగ్గా నిలబడి వెళ్లాల్సిన పరిస్థితి మరోవైపు జనరల్ బోగీల సంఖ్య తక్కువగా ఉండడంతో బోగీలు ఎక్కే వద్ద అడ్డుగా కూర్చుంటున్నారు. దీంతో తమ గమ్యస్థానం వచ్చి దిగాలనుకునే ప్రయాణికులు సైతం కిందకు దిగలేని పరిస్థితి. ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ కోచ్‌లు తగ్గించడంతో పాటు, జనరల్ బోగీలు కుదించారు. గతంలో జనరల్ బోగీలు నాలుగు ఉండగా ప్రస్తుతం రెండుకు కుదించారు. గతంలో 10 నుంచి 12 ఉన్న స్లీపర్ కోచ్‌లు ప్రస్తుతం 8 మాత్రమే ఉన్నాయి. వీటి స్థానంలో ఏసీ కోచ్‌లు పెంచారు.

- బోగీల కుదింపు, రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు
- రిజర్వేషన్లు దొరక్క వెయిటింగ్ లిస్ట్‌తో తంటాలు
- టికెట్ దొరికి రైలెక్కితే సీటు గల్లంతు
- రద్దయిన ప్యాసింజర్ రైళ్లు నేటికీ పట్టాలెక్కని వైనం
- 'ఈస్ట్‌కోస్ట్'లో అడుగుతీసి అడుగు వేయాలంటే కుస్తీ పట్టాల్సిందే

ఏలూరు (టూటౌన్): నిడదవోలు–కడియం స్టేషన్ల మధ్య ఆధునికీకరణ పేరుతో 20కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆకస్మికంగా రద్దు చేశారు. ఈ నెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ ఈ రైళ్లు పట్టాలపై కనిపించవు. ఈ రైళ్లలో ఎంతో డిమాండ్ ఉన్న రత్నాచల్, సింహాద్రి, జన్మభూమి వంటి ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ రైళ్లు ఉండటం గమనార్హం. ఈ రైళ్లలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు వంటి పట్టణాల నుంచి నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులున్నారు. ఏలూరు రైల్వే స్టేషన్ నుంచి నిత్యం 50కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజు 6 నుంచి 7 వేల వరకూ రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్యాసింజర్ రైళ్ల రద్దుతో భారంగా ప్రయాణం

కరోనా సమయంలో జిల్లాలో నడిచే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పూర్తిగా రద్దు చేశారు. దీంతో నిత్యం వీటిలో ప్రయాణించే చిరు వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఏలూరు స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు ప్యాసింజర్ రైలు, ఉదయం 8 గంటలకు ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లు విజయవాడ వెళ్లేందుకు ఉండేవి. విజయవాడ నుంచి సాయంత్రం 5 గంటలకు, 6 గంటలకు అందుబాటులో ఉండేవి. ఇవి రద్దు కావడంతో బస్సులకు వెళ్ళాల్సి వస్తోంది.

జనరల్ బోగీల కుదింపుతో ఇక్కట్లు

ఏలూరు స్టేషన్ మీదుగా రోజుకు సుమారు 50 రైళ్లు రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో ముందు రెండు, వెనుక రెండు జనరల్ బోగీలతో పాటు, మహిళలు, దివ్యాంగులకు కలిపి ఒక ప్రత్యేక బోగీ ఉండేది. కొన్ని నెలల నుంచి రెండు బోగీలతోనే సరిపెడుతున్నారు. గతంలో స్లీపర్ బోగీలు 10 నుంచి 12 వరకూ ఉండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య 8కి కుదించి అదనంగా ఏసీ బోగీలను పెంచారు.

రాయగడ రద్దుతో అవస్థలు

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వేలాది మంది జీవనోపాధికోసం వచ్చి ఏలూరు, తాడేపల్లిగూడెం వంటి పట్టణాల్లో స్థిరపడ్డారు. వీరంతా గుంటూరు–రాయగడ మధ్య నడిచే ప్యాసింజర్ రైలులో తమ సొంత ప్రాంతాలకు తక్కువ ఖర్చుతో వెళ్లేవారు. ఈ రైలును రద్దు చేయడంతో ఉత్తరాంధ్రకు వెళ్ళేందుకు ప్రజలు అనేక ఇబ్బంది పడుతున్నారు.



రైలు ఎక్కే మార్గంలో కిక్కిరిసిన ప్రయాణికులు

భక్తులకు తప్పని తిప్పలు

గతంలో కాకినాడ–తిరుపతి మధ్య ప్యాసింజర్ రైలు నడిచేది. ఈ రైలును సైతం రద్దు చేయడంతో తిరుపతి వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు స్టేషన్‌లో ఆగిన ఈస్ట్‌కోస్ట్ ఎక్కేందుకు జనరల్ బోగీల వద్ద జనం, దిగేందుకు తంటాలు

రైళ్లను పునరుద్ధరించాలి

కరోనా సమయంలో ఏలూరు మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. వాటిని పునరుద్ధరించాలి. ఏలూరు నుంచి ఇటు విజయవాడ అటు రాజమండ్రి ప్రయాణించే చిరువ్యాపారులు, ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు దాదాపు వెయ్యి మంది వరకు రాకపోకలు సాగిస్తుండేవారు. ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణతో పాటు వందే భారత్ రైలుకు ఏలూరులో హాల్ట్ ఇవ్వాలి.

– నాగం శివ, డీఆర్‌యుఎం, విజయవాడ డివిజన్ మాజీ సభ్యుడు

ప్రజలను దోచుకుంటున్నారు

రైల్వే ప్రైవేటీకరణలో భాగంగా ప్యాసింజర్ రైళ్లను తగ్గించేశారు. గతంలో విజయవాడ, విశాఖపట్నం వెళ్లేందుకు ప్యాసింజర్ రైళ్లు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అన్నీ రద్దు చేశారు. రాయగడ ప్యాసింజర్‌ను ఎక్స్‌ప్రెస్‌గా మార్చి డబ్బులు దోచుకుంటున్నారు. బీజేపీ ప్రభుత్వం బుల్లెట్ ట్రైన్లు, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల పేరుతో గ్లోబల్ ప్రచారం చేసుకుంటుంది.

– పి.కిషోర్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

రాయగడ రద్దు సరికాదు

మాది విజయనగరం జిల్లా బొబ్బిలి. మా బంధువులు విజయనగరం జిల్లాలోనే ఉండటంతో అప్పుడప్పుడూ వెళ్లేవారం. మాకు రాయగడ ప్యాసింజర్ ఎంతగానో ఉపయోగపడేది. రాత్రి ఎక్కితే తెల్లవారేసరికి చేరుకునేవాళ్లం. గత నాలుగేళ్ల నుంచి రాయగడ ప్యాసింజర్ రైలును ఎక్స్‌ప్రెస్‌గా మార్చి టిక్కెట్ రేటుతో పాటు సమయం మార్చేశారు.

– ఎం.సింహాచలం, ఏలూరు

అకస్మాత్తుగా రద్దు దారుణం

చాలా రోజుల ముందే రిజర్వేషన్లు చేయించుకున్నాం. ఇలా అకస్మాత్తుగా రద్దు చేయడం దారుణం. ముందుగా ప్రకటించి రద్దు చేసి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు. రైళ్ల రద్దుతో సాధారణ, రిజర్వేషన్ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు రైళ్లను అకస్మాత్తుగా రద్దు చేయడం దుర్మార్గం.

– జి.వెంకయ్య, న్యాయవాది, చింతలపూడి

వీడని ముంపు

యలమంచిలి: గోదావరిలో వరద మంగళవారం తగ్గుముఖం పట్టింది. కనకాయలంక కాజ్‌వే మీద వరద నీరు క్రమంగా తగ్గుతుంది. ప్రస్తుతం సుమారు ఆరు అడుగులు వరద నీరు ప్రవహిస్తుంది. రోడ్డు బయట పడడంతో ప్రజలు రోడ్డు మీద నుంచి పడవ ఎక్కి కాజ్‌వే దాటుతున్నారు. బుధవారం సాయంత్రానికి కాజ్‌వే వరద నీటి నుంచి బయటపడవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. కాజ్‌వే మీద నీరు పూర్తిగా తగ్గే వరకు పడవలు కొనసాగిస్తామని తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ తెలిపారు. కనకాయలంక గ్రామంలోని పల్లపు వీధుల్లో ఇంకా వరద నీరు ప్రవహిస్తోంది. బాడవలో పల్లపు వీధుల్లో ఇంకా వరదనీరు ఉంది. కాజ డ్రెయిన్‌లో నీరు గట్టు దాటి రావడంతో ఏనుగువానిలంకలోని ఇందిరమ్మ కాలనీలోనికి వరదనీరు వచ్చింది.



ఏనుగువానిలంకలో జలమయమైన ఇందిరమ్మ కాలనీ

కల్వర్టు నిర్మాణానికి అంచనాలు

పాలకోడేరు: వేండ్ర గ్రామంలోని 2వ వార్డులో డ్రైనేజీ కోసం రోడ్డును తవ్వి వదిలేశారని దాంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారంటూ ×మురుగు సమస్య సరే.. రోడ్డు తవ్వేశారే¤ అనే శీర్షికతో మంగళవారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి దొంగ సత్యనారాయణ, పంచాయతీ రాజ్ ఏఈ విజయ్ కుమార్ రాజు, మండల ఈఓపీఆర్‌డీ ఆంజనేయులు ఆ ప్రాంతానికి వెళ్ళి రోడ్డు వేసేందుకు అంచనాలు తయారు చేశారు. రెండు రోజుల్లో పనులు మొదలు పెడతామని ఈవోపీఆర్‌డి తెలిపారు.

సాక్షి స్పందన



వేండ్ర 2వ వార్డులో కల్వర్టు నిర్మించేందుకు పరిశీలిస్తున్న అధికారులు

చిట్టిరాజు ఐపీఎస్

- భీమవరం నుంచి తొలి ఐపీఎస్ అధికారి
- సివిల్స్‌లో 833వ ర్యాంకు.. ఐపీఎస్ కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు
- మండలి చైర్మన్ మోషేనురాజు తనయుడే చిట్టిరాజు
- సేవ చేయాలన్న సంకల్పమే సివిల్స్‌కు పునాది: చిట్టిరాజు

సాక్షి, భీమవరం: చిన్నప్పటి నుంచి తండ్రి ప్రజాసేవను దగ్గర నుంచి చూసిన ఆ చిన్నారిలో తాను పెద్దయ్యాక సమాజ సేవ చేయాలన్న ఆకాంక్ష అంకురించింది. అలాగే పలువురు ఐఏఎస్ అధికారుల పనితీరును గమనించి తాను సివిల్స్‌కు ఎంపికైతే ప్రజా సేవ చేయవచ్చని గట్టిగా నిర్ణయించుకున్నారు. అదే సివిల్స్ వైపు నడిపించాయంటున్నారు కొయ్యే చిట్టిరాజు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు చిన్నకుమారుడు చిట్టిరాజు. పట్టువదలని విక్రమార్కుడిలా సివిల్స్ ప్రయత్నించి విజయం సాధించి ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)కు ఎంపికయ్యారు. భీమవరం నుంచి తొలి ఐపీఎస్ అధికారిగా ఖ్యాతిగాంచారు. ఆగస్టు 26న ముస్సోరీలోని కేంద్రానికి శిక్షణకు రావాలని తాజాగా ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఢిల్లీలో ఉన్న చిట్టిరాజును 'సాక్షి' ఫోన్‌లో పలకరించింది.

సాక్షి: మీ విద్యాభ్యాసం ఎక్కడెక్కడ సాగింది?

చిట్టిరాజు: ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు భీమవరంలోని మాంటిస్సోరి, 10వ తరగతి వరకు సెంట్ ఆన్స్, ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీచైతన్యలో చదువుకున్నాను. బీటెక్ వైజాగ్‌లోని ఆంధ్ర యూనివర్శిటీలో ఈసీఈ గ్రూప్‌లో పూర్తి చేశాను.

సాక్షి: సివిల్స్‌పై ఆసక్తి ఎప్పుడు కలిగింది?

చిట్టిరాజు: మా నాన్నగారు ప్రజాసేవలో ఉండటం చూసి చిన్నతనం నుంచి పబ్లిక్ సర్వీస్ పట్ల ఆసక్తి పెరిగింది. ప్రజలకు సేవ చేయాలన్న తపనతోనే సివిల్స్‌పై మక్కువ పెంచుకున్నాను.

సాక్షి: సివిల్స్‌కి స్ఫూర్తి ఎవరు?

చిట్టిరాజు: మా తండ్రి మోషేన్‌రాజు, పశ్చిమగోదావరి జిల్లా పూర్వపు కలెక్టర్ లవ్‌అగర్వాల్, జిల్లా నుంచి ఐఏఎస్‌గా ఎదిగిన రేవు ముత్యాలరాజు నాకు ప్రేరణగా నిలిచారు.

సాక్షి: సివిల్స్ ప్రయాణం ఎప్పుడు మొదలైంది?

చిట్టిరాజు: బీటెక్ పూర్తయ్యాక చెన్నైలోని ఇన్ఫోసిస్‌లో రెండున్నర సంవత్సరాల పాటు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశాను. 2018–19లో సివిల్స్ పట్ల ఆసక్తితో ఉద్యోగం మానేసి సివిల్స్ వైపు ప్రయాణం మొదలుపెట్టాను.

సాక్షి: కోచింగ్ ఎక్కడ తీసుకున్నారు

చిట్టిరాజు: ఢిల్లీలోని వాజిరామ్ అండ్ రవి సివిల్స్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్నాను.



మోషేనురాజు ఇంట పండుగ వాతావరణం

చిట్టిరాజు ఐపీఎస్‌కు ఎంపిక కావడంతో భీమవరంలోని మండలి చైర్మన్ మోషేనురాజు ఇంట పండుగ వాతావరణం నెలకొంది. మోషేనురాజు, సతీమణి అన్నామణి, కుమార్తె ఇందిర, పెద్దకుమారుడు సుందర్‌రాజు, కుటుంబ సభ్యులు స్వీట్లు తినిపించుకుని వేడుక జరుపుకున్నారు. చుట్టుపక్కల వారు, పలువురు ప్రముఖులు మోషేనురాజు ఇంటికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపాశారు. ఈ సందర్భంగా మోషేనురాజు మాట్లాడుతూ చిట్టిరాజు ఐపీఎస్‌కు ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తంచేశారు. పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడని, ఐపీఎస్ అధికారిగా ప్రజలకు మంచి సేవలు అందిస్తాడని అన్నారు.

సాక్షి: ఎన్నో ప్రయత్నంలో ర్యాంకు సాధించారు?

చిట్టిరాజు: ఆరో ప్రయత్నంలో విజయం సాధించాను.

సాక్షి: రోజుకు ఎన్ని గంటలు చదివేవారు, ప్రిపరేషన్ ఎలా ప్లాన్ చేసుకున్నారు?

చిట్టిరాజు: రోజుకు 10 నుంచి 12 గంటల పాటు చదివేవాడిని. సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్ ప్లాన్ చేసుకున్నాను.

సాక్షి: తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సహకారం?

చిట్టిరాజు: సివిల్స్ ప్రిపరేషన్‌కు నా తల్లిదండ్రుల సహకారంతో ఎంతో ఉంది. అడుగడుగునా నా కుటుంబ సభ్యులు వెన్నంటి ఉండి ప్రోత్సహించారు. స్నేహితులు, రూమ్‌మేట్స్ నా విజయానికి ఎంతగానో సహకరించారు.

సాక్షి: మెంటార్లు ఎలాంటి సహకారం అందించారు?

చిట్టిరాజు: విజేత ఐఏఎస్ అకాడమీ మెంటర్ కిషోర్ సహకారం మరువలేనిది. ఆయన నాకు సివిల్స్ ప్రిపరేషన్‌పై మెళకువలు నేర్పించారు.

సాక్షి: ట్రైనింగ్‌కు ఎప్పుడు వెళ్తున్నారు?

చిట్టిరాజు: ఆగస్టు 26న ముస్సోరిలోని శిక్షణ కేంద్రానికి వెళ్తున్నాను.

సాక్షి: సివిల్స్‌కు వెళ్లాలనుకునే వారికి మీరిచ్చే సలహా?

చిట్టిరాజు: సివిల్స్‌కు వెళ్లాలని అనుకునే వారు ఒక ఉద్యోగం, హోదా అనే కోణంలో కాకుండా ప్రజలకు సేవ చేయాలనే కోణంలో ఆలోచించాలి. పబ్లిక్ సర్వీసెస్ పట్ల మక్కువ ఉండాలి. పట్టుదలతో కష్టపడితే ఈ పరీక్ష క్వాలిఫై అవ్వడం అందరికి సాధ్యమే.

క్లుప్తంగా

బైక్ ఢీకొని కూలీ మృతి

పాలకోడేరు: కూలి పనులు డబ్బులు కోసం పెళ్లి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొనడంతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకోడేరుకు చెందిన గుంటబోయిన అప్పలనాయుడు (58) వ్యవసాయ కూలీ. సోమవారం అదే గ్రామంలో పందొడ్డి ప్రాంతానికి కూలి పనుల డబ్బులు కోసం నడిచివెళ్లి తిరిగి వస్తుండగా మోగల్లు నుంచి పాలకోడేరు వైపు వెళుతున్న మోటార్ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతనిని భీమవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

పంటబోదెలో పడి వ్యక్తి మృతి

భీమవరం: ప్రమాదవశాత్తు పంటబోదెలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని 39వ వార్డు దుర్గాపురానికి చెందిన కూతాడ శ్రీను (40)కు ఫిట్స్ వ్యాధి ఉంది. ఈనెల 29న పక్కనే ఉన్న తన తల్లి ఇంట్లో టీవీ చూడటానికి వెళ్లాడు. అయితే ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య, బంధువులు వెతకగా ఇంటి సమీపంలోని పంటబోదెలో శ్రీను మృతదేహం మంగళవారం కనిపించింది. దీనిపై మృతుడి భార్య గంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇస్సాకు అయ్యగారు ఇక లేరు


పాకలపాటి ఇస్సాకు అయ్యగారు (ఫైల్)

కాళ్ల: ప్రముఖ దైవజనులు పాకలపాటి ఇస్సాకు అయ్యగారు ఈనెల 26వ తేదీన పరమపదించారు. ఆయన మృతికి కాళ్ల మండలంతో పాటు అనేక ప్రాంతాల ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. ఇస్సాకు అయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాళ్లలో సుమారు 65 ఏళ్లుగా గ్రేస్ మినిస్ట్రీస్ స్థాపించి దేవుని సేవలో కొనసాగారు. క్రైస్తవ బోధనలు చేయడంతో పాటు గ్రేస్ మినిస్ట్రీస్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు. ఆయన మరణం కుటుంబంతోపాటు విశ్వాసులకు తీరని లోటని పలువురు పెద్దలు తెలిపారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం

సీతమ్మధార (విశాఖ జిల్లా): వైద్యం నిమిత్తం విశాఖకు తీసుకొచ్చిన మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యం కావడంతో బంధువులు ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ఎన్.గాంధీ (60) వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. కొంతకాలంగా మతిస్థిమితం లేక కుటుంబ సభ్యులు సోమవారం వాల్తేరులోని మెంటల్ ఆస్పత్రికి తీసుకువచ్చి చూపించారు. అనంతరం తిరుగు ప్రయాణం కోసం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. రాత్రి పదిగంటల సమయంలో కుటుంబ సభ్యులంతా టిఫిన్ చేస్తుండగా గాంధీ కనిపించలేదు. రైల్వే స్టేషన్ పరిసరాలు వెతికినా అతని జాడ తెలియలేదు. దీంతో గాంధీ కుమారుడు నాగేంద్ర ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. హెచ్‌సీ బంధం వరలక్ష్మి, పోలీసు సిబ్బంది రైల్వే స్టేషన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తన సెల్ నంబర్ 94407 96012, స్టేషన్ నంబర్ 08912–710695కు సమాచారం ఇవ్వాలని సీఐ ఎస్.విజయకుమార్ కోరారు.

సొమ్ములు అందక.. సాగు సాగక

- రబీ ధాన్యం సొమ్ము కోసం రైతుల ఎదురుచూపులు
- 71 వేల మంది నుంచి 6.40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- 20 వేల మంది రైతులకు రూ.416 కోట్ల బకాయిలు
- పెట్టుబడి సాయమూ అందించని కూటమి ప్రభుత్వం
- ఖరీఫ్‌లో పెట్టుబడి కోసం చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు

ఈ ఏడాది రబీ సీజన్‌లో ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఖరీఫ్ సాగు ప్రారంభమైనా ఇప్పటికీ సొమ్ములు చెల్లించకపోవడంతో రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. దీనికి తోడు ఏటా ఇచ్చే పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం అందించకపోవడంతో ఖరీఫ్ సాగుకు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో 20 వేల మంది రైతులకు రూ.416 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువుతీరిన నేపథ్యంలో తమకు ధాన్యం సొమ్ము బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారోనంటూ రైతులు ఎదురుచూస్తున్నారు.


భీమవరం ప్రాంతంలో ధాన్యం పట్టుబడి పడుతున్న రైతులు (ఫైల్)

భీమవరం: రైతులకు అండగా ఉంటామంటూ అందలమెక్కిన కూటమి ప్రభుత్వం రైతన్న ఆరుగాలం పండించిన పంటను విక్రయించి నెలలు గడిచిపోతున్నా సొమ్ములు చేతికి అందకపోవడంతో లబోదిబోమంటున్నారు. జిల్లాలోని ఎక్కువ మంది రైతులకు వ్యవసాయమే జీవనాధారం. ప్రతి ఏటా సార్వా, దాళ్వా వరి పంటను పండించి దానిపై వచ్చే ఆదాయంతోనే జీవనం సాగిస్తారు. జిల్లాలో సుమారు 2.40 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా గత ప్రభుత్వం రైతులకు ప్రతి ఏటా పంట పెట్టుబడి సహాయంతోపాటు రైతులు పండించిన పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకుంటే దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే సొమ్ములు జమ చేసేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతన్నకు అండగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలు ఇస్తామని, పంటలు విక్రయించిన వెంటనే సొమ్ములు చెల్లిస్తామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

రైతులకు రూ.416 కోట్లు బాకీ

జిల్లాలో గడిచిన దాళ్వా సీజన్‌లో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏప్రిల్ మొదటి వారం నుంచి సుమారు 71వేల మంది రైతుల నుంచి రూ.1,400 కోట్ల విలువైన 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అప్పటినుంచి సుమారు 50 వేల మంది రైతులకు దాదాపు రూ.984 కోట్లు బ్యాంకు ఖాతాల్లో నగదు జమైంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును జూన్ 15వ తేదీతో ప్రభుత్వం నిలిపివేసింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 21 వేల మంది రైతులకు దాదాపు రూ.416 కోట్లు చెల్లించాల్సి ఉంది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడిచిపోతున్నా సొమ్ములు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేయడంతో సార్వా పెట్టుబడికి సొమ్ములు లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సహాయం అందకపోగా తాము విక్రయించిన ధాన్యానికి సైతం సొమ్ములు చెల్లించకపోవడంతో ప్రస్తుత సార్వా పెట్టుబడులకు సొమ్ములు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం సొమ్ములు అందకపోవడంతోపాటు భారీ వర్షాలు, వరదల కారణంగా అనేక మంది రైతులు వరినాట్లు, నారుమడులు మునిగి దెబ్బతినడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే అప్పులు చేసి నాట్లు వేస్తే నీట మునిగి దెబ్బతిన్నాయని తిరిగి నాట్లు వేయాలంటే మరింత పెట్టుబడి పెట్టాలని, దీనికి ప్రభుత్వ సహాయం అటుంచి తాము పండించిన పంటకు సొమ్ములు చెల్లించినా తిరిగి నాట్లు వేసుకునే అవకాశముంటుందని వాపోతున్నారు. ఎన్నికల్లో గొప్పగా ప్రచారం చేసిన నాయకులు రైతులకు సొమ్ములు చెల్లించడంపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

రూ.1.50 లక్షలు రావాల్సి ఉంది



నేను మే 20వ తేదీన రైతు భరోసా కేంద్రానికి 150 సార్ల ధాన్యం విక్రయించాను. సుమారు రూ.1.50 లక్షలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ధాన్యం అమ్మి రెండు నెలలు గడిచిపోయినా సొమ్ములు అందకపోవడంతో సార్వా పెట్టుబడికి సొమ్ము లేక కష్టంగా ఉంది. ప్రభుత్వం తక్షణం స్పందించి సొమ్ములు చెల్లించాలి.

– ఎస్.సురేష్, రైతు, తాడేరు

సొమ్ములెప్పుడిస్తారు?



నేను ధాన్యం అమ్మి రెండు నెలలకుపైగా గడిచిపోయింది. మే నెలలో దఫదఫాలుగా ఆర్‌బీకేలకు ధాన్యం అమ్మా. సుమారు రూ.1.40 లక్షలు రావాల్సి ఉంది. ధాన్యం సొమ్ములు చేతికి అందకపోవడంతో కూలీలు, ట్రాక్టర్ దమ్ము వంటి వాటికి చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సొమ్ములు ఇచ్చే ఏర్పాటు చేయాలి.

మట్టా ఏసు, తాడేరు, భీమవరం మండలం

ధాన్యం సొమ్ములు చెల్లించాలంటూ ధర్నా


భీమవరం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఏడీ మాధురికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లాలోని రైతులకు దాళ్వా ధాన్యం సొమ్ము బకాయిలను తక్షణం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి తొంట సత్యనారాయణరాజు, కోశాధికారి కనుమూరి విశ్వనాథ సుబ్బరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ ఏడీ మాధురికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాలకు చెందిన సుమారు 20 వేలకు పైగా రైతులకు సుమారు రూ.510 కోట్లు చెల్లించాల్సి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం సొమ్ములు అందక ఇబ్బందులుపడుతున్న రైతులకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరినాట్లు, నారుమళ్లు నీట మునిగి తీవ్ర నష్టం ఏర్పడి కోలుకోలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణం స్పందించి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి ధాన్యం సొమ్ములు ఇప్పించాలని కోరారు. తొలుత ధాన్యం సొమ్ములు చెల్లించాలంటు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంఘ్ ఉపాధ్యక్షుడు గంటా నాగరాజు, నున్నా అంజిబాబు, పోశింశెట్టి మురళీ, పెన్మెత్స వెంకట రామరాజు, పెన్మెత్స రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

11 వరకు పలు రైళ్ల దారి మళ్లింపు

ఏలూరు (టూటౌన్): విజయవాడ డివిజన్‌లో నిర్వహిస్తున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో పలు రైళ్లను దారి మళ్లించినట్లు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం.మండ్రుపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సికింద్రాబాద్-విశాఖపట్టణం, విశాఖపట్టణం-సికింద్రాబాద్ రైలును ఆగస్టు 2 నుంచి 11వ తేదీ వరకు, సీఎస్‌టీ ముంబై-భువనేశ్వర్ రైలును 2వ తేదీ నుంచి 10 వరకు, యశ్వంత్ నగర్-టాటానగర్ రైలును 4వ తేదీన, సాయినగర్-కాకినాడ పోర్టు 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు, న్యూఢిల్లీ-విశాఖపట్టణం, విశాఖపట్టణం-న్యూఢిల్లీ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు, భువనేశ్వర్-సీఎస్‌టీ ముంబై రైలును 2 నుంచి 10వ తేదీ వరకు, కాకినాడ పోర్టు-సాయినగర్ రైలును 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు, టాటా నగర్-యశ్వంత్‌పూర్ రైలును ఆగస్టు 8న దారి మళ్లించనున్నట్లు తెలిపారు. ఈ రైళ్లు అన్నీ రాయనపాడు-గుడివాడ-నిడదవోలు మార్గంలో నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైళ్లు ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో ఆగాల్సి ఉందని, దారి మళ్లింపు వల్ల ఈ స్టేషన్లలో రైళ్లు ఆగవని, ముందుగా రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

విద్యార్థుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ గోలి లక్ష్మయ్య, పక్కన సీఐ మూర్తి

నూజివీడు: విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండి విధులను పకడ్బందీగా నిర్వహించాలని నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో సెక్యూరిటీ సిబ్బందికి, కేర్‌టేకర్‌లకు సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ క్యాంపస్‌లో చదువుతున్న 9 వేల మంది విద్యార్థులను జాగ్రత్తగా చూడాల్సిన బాధ్యత వీరిపైనే ఉందన్నారు. బాధ్యతలను నిర్వర్తించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నూజివీడు టౌన్ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ ఆచార్య ఎం చంద్రశేఖర్, పరిపాలనాధికారి టీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆకివీడులో చోరీ

రూ.3 లక్షల నగదు, 7 కాసుల బంగారం అపహరణ


వేలిముద్రలు సేకరిస్తున్న నిపుణులు

ఆకివీడు: పట్టణంలోని ముస్లిం వీధిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. ముస్లిం వీధిలో నివసిస్తున్న కటికతల రాజారావు ఈ నెల 24న ఇంటికి తాళం వేసి బెంగుళూరులో ఉంటున్న తన కుమారుడు వద్దకు వెళ్లారు. అయితే ఆకివీడులో నివసిస్తున్న అతని సోదరి రాజారావు ఇంట్లో మొక్కలకు నీళ్లు పోసేందుకు ఈ నెల 28న వెళ్లగా తలుపుల తాళాలు బద్దలు కొట్టి ఉండటాన్ని గుర్తించి రాజారావుకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపింది. వెంటనే ఆయన ఫోన్‌లో ఎస్సైకి ఫిర్యాదు చేయగా, ఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మంగళవారం ఆకివీడు చేరుకున్న రాజారావు ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఎస్సై క్లూస్ టీమ్‌ను రప్పించగా, ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాల కోసం ప్రయత్నించారు. ఈ చోరీ ఘటనలో రూ.3 లక్షల నగదు, 7 కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు చెప్పారు.

5 నుంచి బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రామీణ యువతులకు ఉపాధి కల్పించే నిమిత్తం ఆగస్టు ఐదో తేదీ నుంచి బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ అందించనున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, పదో తరగతి ఉత్తీర్ణులై, 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు అర్హులన్నారు. 95027 23561 నంబర్‌కు ఫోన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్టు

- అమలాపురంలో ఐదుగురు నిందితుల అరెస్ట్
- 5 ల్యాప్‌టాప్‌లు, 75 స్మార్ట్ ఫోన్లు, ఏటీఎం కార్డుల స్వాధీనం
- పరారీలో భీమవరానికి చెందిన ఇద్దరు సూత్రధారులు


ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లతో సీఐలు క్రిస్టోఫర్, అబ్దుల్ సలామ్, క్రైమ్ పోలీసులు

అమలాపురం టౌన్: ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో క్రికెట్ తదితర గేమ్‌ల పేరుతో మోసం చేస్తున్న ఓ ముఠాను అమలాపురం పట్టణ పోలీసులు ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నారు. అమలాపురం పట్టణం ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న ఓ లాడ్జిలో ఐదుగురు వ్యక్తులు ఆన్‌లైన్ బెట్టింగులతో ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా పలువురి బ్యాంక్ ఖాతాదారులకు వల పన్నుతున్న సమయంలో పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్, క్రైమ్ సీఐ అబ్దుల్ సలామ్‌ల ఆధ్వర్యంలో క్రైమ్ పోలీసుల బృందం సోమవారం మాటు వేసి ఆ ముఠాలోని ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించింది. తీగ లాగితే డొంక కదిలినట్లు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఇద్దరి కీలక వ్యక్తుల ఆధ్వర్యంలో ఈ ముఠా నడుస్తోందని దర్యాప్తులో గుర్తించారు. అదుపులోకి తీసుకున్న ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అజ్ఞాతంలో ఉన్న ఇద్దరి కీలక సూత్రధారుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. లాడ్జిలో పట్టుబడ్డ ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా సభ్యులైన ఐదుగురు నిందితులు అమలాపురం రూరల్ మండలం భట్లపాలేనికి చెందిన మోటూరి దొర సత్య సూర్య మణికంఠ, మోటూరి మధు పవన్, ఏలూరు జిల్లా కైకలూరు మసీద్ రోడ్డుకు చెందిన భలే ప్రవీణ్‌బాబు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పంజా సాయినరసింహ, గురజాపు సూర్య ప్రభులను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పట్టణ సీఐ క్రిస్టోఫర్ తెలిపారు. వీరి నుంచి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అయిదు ల్యాప్‌టాప్‌లు, 75 స్మార్ట్ ఫోన్లు, 15 సిమ్ కార్డులు, 19 బ్యాంక్ బుక్‌లు, 25 ఏటీఎం కార్డులు, 7 నోట్ బుక్‌లు, ఒక వైఫై రూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పోలీసులు దాడి చేస్తున్న సమయంలో ఈ ముఠా ఆన్‌లైన్ ద్వారా పలువురిని మోసం చేసే ప్రక్రియలో ఉందని తెలిపారు. సూత్రధారులైన ఇద్దరూ కూడా పట్టుబడితే ఈ ముఠా ఆన్‌లైన్ గేమ్‌ల మోసాలు మరింత వెలుగు చూస్తాయన్నారు. స్వాధీనం చేసుకున్న 75 స్మార్ట్ ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్‌లోని కొన్ని యాప్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ యాప్‌ల ద్వారా పలువురి వాట్సాప్ లింక్ ఆధారంగా వారి గ్రూపుల్లోకి ప్రవేశించి బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ యాప్‌లను తక్షణమే తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గూగుల్ సంస్థకు లేఖ రాసినట్లు సీఐ తెలిపారు. బెట్టింగ్ ముఠాను పట్టుకోవడంలో క్రైమ్ ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు రాజు, రమణ, కానిస్టేబుళ్లు ప్రసాద్, సాయి, హరి, ప్రసాద్ చొరవ చూపారు. పట్టణ పోలీసులు, క్రైమ్ పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

సెక్షన్‌లకు బదిలీపై విద్యుత్ రెవెన్యూ ఉద్యోగుల ఆందోళన


తణుకులో నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో అదనంగా ఉద్యోగులు ఉండడాన్ని గుర్తించి వారిని విద్యుత్ సెక్షన్ కార్యాలయాలకు బదిలీ చేయాలన్న యాజమాన్యం చర్యలను నిరసిస్తూ ఏలూరు విద్యుత్ సర్కిల్ పరిధిలోని పలు కార్యాలయాల్లో మంగళవారం ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, కొవ్వూరు, నరసాపురం తదితర కార్యాలయాల్లో ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేసే తమను ఇతర విభాగాల్లోకి మార్చడంపై సరైన విధివిధానాలు లేవన్నారు. అక్కడ తాము ఏ పని చేయాలనే దానిపై స్పష్టత లేదన్నారు.

ఈఆర్వో వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే..

తణుకు: విద్యుత్ శాఖలో కీలకమైన ఈఆర్వో వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా ఏపీఈపీడీసీఎల్ యాజమాన్యం వ్యవహరిస్తోందని తణుకు విద్యుత్ శాఖ అకౌంటింగ్ సిబ్బంది ఆరోపించారు. తణుకులోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏపీ ట్రాన్స్‌కో ఆదేశాలతో సంబంధం లేకుండా సీఎండీ ఉత్తర్వులను జారీ చేసి వినియోగదారులకు ఈఆర్వో విభాగం అందించే నాణ్యమైన సేవలను దూరం చేస్తున్నారని స్పష్టం చేశారు. గతంలో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన రిడెవలప్‌మెంట్ పూర్తిగా నిర్వీర్యమై సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తణుకు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురికి రిమాండ్

దెందులూరు: కూచింపూడిలో ఈ నెల 26న జరిగిన హత్య ఘటనకు సంబంధించి కేసులో అరెస్టు చేసిన నలుగురు నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఇన్‌చార్జి సీఐ నబీ చెప్పారు. హత్య కేసులో నిందితులైన కలపాల రమేష్, కలపాల అచ్చియ్య, కలపాల రాజేష్, కలపాల రమేష్‌లను కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

పురుగుమందు డబ్బాలతో రైతుల నిరసన

- వ్యాపారులు కొన్న ధాన్యానికి సొమ్ము చెల్లించాలంటూ డిమాండ్
- గవరవరం ధాన్యం గోడౌన్ వద్ద రైతులు భైఠాయించి ఆందోళన


గవరవరం గోడౌన్ వద్ద పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న రైతులు

కొయ్యలగూడెం: వ్యాపారికి ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా తమకు సొమ్ములు చెల్లించకపోవడంతో నిరసనగా గవరవరంలోని గోడౌన్స్ వద్ద రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. వరి, మొక్కజొన్న బకాయి సొమ్ములు సుమారు రూ.రెండున్నర కోట్ల వరకు తమకు చెల్లించాల్సి ఉందని వాపోతున్నారు. వివరాలిలా ఉన్నాయి. పోలవరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు గూటాలకు చెందిన ధాన్యం వ్యాపారి పన్నూరి సూరిబాబుకు మూడు నెలల క్రితం పంటను విక్రయించారు. అమ్ముకున్న రెండు పంటల విలువ కలిపి సుమారు రూ.13.50 కోట్ల విలువ ఉంటుంది. కొనుగోలు సమయంలో వ్యాపారి సూరిబాబు పదిహేను రోజుల్లో రైతులకు సొమ్ములు అందజేస్తానని చెప్పాడు. అనంతరం రైతులకు సుమారు రూ.11 కోట్లు చెల్లించగా, ఇంకా 86 మంది రైతులకు రూ.2.25 కోట్లు ఇవ్వాల్సి ఉంది. తాను కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేరొక దళారి ద్వారా జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన సుందరానికి అమ్మినట్లు సూరిబాబు చెబుతున్నాడు. సుందరం మధ్యవర్తి, సూరిబాబు ద్వారా వచ్చిన ధాన్యాన్ని అమ్మగాపోను మిగిలిన సుమారు రూ.3 కోట్ల విలువైన ధాన్యాన్ని కొయ్యలగూడెం మండలానికి చెందిన కొందరు హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయించాడు. అయితే బకాయి సొమ్ము కోసం మూడు నెలలుగా సూరిబాబు చుట్టూ రైతులు తిరుగుతున్నా పొంతన లేని సమాధానం చెబుతున్నాడు. దీనిపై వ్యాపారులు సూరిబాబు, సుందరం ఇద్దరూ దాటవేత వైఖరి అవలంభిస్తున్నారు. తమ నుంచి కొనుగోలు చేసిన ధాన్యం కొయ్యలగూడెంకు చెందిన హోల్‌సేల్ వ్యాపారులు కొనుగోలు చేశారని, అదంతా గవరవరం గోడౌన్‌లో ఉందన్న సమాచారంతో రైతులు అక్కడకు చేరుకుని తమకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో హోల్‌సేల్ వ్యాపారులు, రైతుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రైతులు పురుగుమందు డబ్బాలతో భైఠాయించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలవరం ఎస్సై పవన్ కుమార్ మంగళవారం రాత్రి వ్యాపారులు, రైతు ప్రతినిధులతో చర్చలు జరిపారు.

ఉద్యాన వర్సిటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన ఉద్యాన వర్సిటీ విద్యార్థులు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 'కనెక్టింగ్ సక్సెస్ అండ్ ఇంటరాక్టివ్ సెషన్ విత్ యూనివర్సిటీ ఆలుమ్ని' పేరిట పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వివిధ హోదాల్లో స్థిరపడిన వీరు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ మాట్లాడుతూ.. కళాశాలలో ఉన్నప్పటి నుంచే సీనియర్స్ తమ జూనియర్స్‌కు సరైన మార్గదర్శకాన్ని ఇవ్వాలన్నారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డీఆర్ సలోమి సునీత మాట్లాడుతూ పూర్వ విద్యార్థులతో సత్సంబంధాలు మెరుగుపరచుకోటానికి, జ్ఞానాన్ని పొందటానికి ఈ వేదిక సుగమం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేస్తున్న వర్సిటీ డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి, కళాశాల అసోసియేట్ ప్రొ.అర్చన తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): శుభ్రతతోనే ఆరోగ్యమని లేకుంటే అనారోగ్యం తప్పదని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. డెంగీ మాసోత్సవాలు సందర్భంగా వీకర్స్‌కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని 3వ వార్డులో సబ్ యూనిట్‌వారిచే ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. వక్తలు మాట్లాడుతూ వర్షాలు దోమ పుట్టుకకు అవసరమైన కాలమని, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. జ్వరం వస్తే ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మంగతాయరు, ఆశాలు, వార్డు ఆరోగ్య కార్యకర్తలు సరళ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

యుద్ధం ఆపాలంటూ నిరసన

తాడేపల్లిగూడెం (టీటీసీ): పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని కోరుతూ సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలని, ప్రపంచ శాంతి కావాలని, యుద్ధం వద్దు అంటూ నినాదాలు చేశారు. పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, సిరపరపు రంగారావులు మాట్లాడుతూ పాలస్తీనాకు మానవత సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సత్తి కోదండ రామిరెడ్డి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అయినాల సత్యనారాయణ, చిట్టేటి సత్యనారాయణ, నర్మాల నారాయణరావు, పోతు శ్రీను, రాము, కొండలరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐఎఫ్‌టీయూ రాజకీయ శిక్షణా తరగతులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని కోతిబొమ్మ సెంటర్‌లో ఆగస్టు 1వ తేదీన ఐఎఫ్‌టీయూ ఏరియా కమిటీ రాజకీయ శిక్షణా క్లాసులు నిర్వహిస్తున్నట్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి మామిడి దాన వరప్రసాద్ వెల్లడించారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని ఎడ్యుకేట్ చేసేందుకు రాజకీయ శిక్షణా తరగతులని, దోపిడి రహిత శ్రామిక రాజ్య స్థాపన సాధించాలన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలపై సమర శంఖం పూరించాలన్నారు. అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఆదినారాయణ, రాజు, రమేష్, మోహన్, శ్రీనివాస్, రామకృష్ణారావు, రాంబాబు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో మంగళవారం అధ్యక్షుడు వీవీఎన్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం జరిగింది. నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వైద్య బృందంచే 62 మందికి కంటి పరీక్షలు జరిగాయి. జిల్లా డిప్యూటీ గవర్నర్ పదం కుమార్ గుప్తా, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, కార్యదర్శి చిన్నం జగదీష్, హరిబాబు, మదన్ మోహన్ అగర్వాల్‌లు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 9 మందిని నిడదవోలుకు పంపారు. ఈ కార్యక్రమంలో సుంకర శ్రీనివాస్, బాపయ్య శర్మ, వి.రామ్మోహన్‌రావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు తణుకులో జాబ్ మేళా

తణుకు టౌన్: తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేళాలో ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్, ఈవెన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. 2021,2022, 2023, 2024 సంవత్సరాల్లో డిగ్రీ పాసైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 1వ తేదీన కళాశాలలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ



పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): నవ భారత్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ కప్రి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక 22వ వార్డు మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. రాకుర్తి కిరణ్, షేక్ నాగు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలు.. సులభతర నైపుణ్యాలు





తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఎంఈవో హైమావతి, ఉపాధ్యాయులకు ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగాలను వివరిస్తున్న విద్యార్థి, సైన్స్ పరికరాలతో విద్యార్థులు

- వాస్తవాలను కళ్లకు కట్టినట్లు చూపిన ప్రదర్శనలు
- శిక్షా సప్తాహ్ సక్సెస్..
- తల్లిదండ్రుల పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు



తల్లిదండ్రుల పేర్లమీద మొక్కలు నాటిన విదార్థులతో ఎంఈవో హైమావతి



రూపొందించిన ప్రదర్శనలతో విద్యార్థులు

తణుకు అర్బన్: నేటి ఆధునిక సమాజంలో దినదినాభివృద్ధి చెందుతున్న సైన్స్‌రంగం విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలకు దోహదపడుతోంది. అందుకు నిదర్శనంగా తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడు రోజులపాటు నిర్వహించిన శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శనలు ఆలోచింపచేశాయి. పాఠశాలలో అందుబాటులో ఉన్న సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా విద్యార్థులు అవగాహన కలిగించుకుని సద్వినియోగపడే రీతిలో ప్రయోగాలను ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

పాఠశాలలో ఇటీవల ఏర్పాటైన ఎకో క్లబ్ (పర్యావరణ క్లబ్బులు) విద్యార్థులు పర్యావరణ అంశాలపై దృష్టి సారించి చేసిన ప్రదర్శనల్లో భాగంగా ఇంకుడు గుంతలు, కంపోస్టు గుంటల తయారీ, క్లీన్ అండ్ గ్రీన్, పోషకాహార విలువలు, సైకో మోటార్ అంశాలు, సైన్స్ లేబరేటరీలు, బోధనోపకరణాల ఉపయోగం, ఎలక్ట్రానిక్ పరికరాల ప్రదర్శన, కృత్యాలు వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇందులోభాగంగా ఎకో క్లబ్ విద్యార్థులు అమ్మవనం పేరుతో వారి తల్లి తండ్రుల పేరుతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకున్నారు.

సైన్స్ ప్రదర్శనలు చాలా ఇష్టం



సైన్స్ ప్రదర్శనలంటే చాలా ఇష్టంగా చేస్తాను. మా ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనల మేరకు నేను ప్రదర్శనలు చేశాను. ఏడు రోజులపాటు నా ప్రయోగం ప్రదర్శనలో ఉండడం సంతోషంగా ఉంది.

– కె. నాగూర్ మన్సూర్, తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి

పాఠ్యాంశాల్లోంచే ప్రయోగాలు



సైన్స్ పాఠ్యాంశాలను కళ్లకు కట్టినట్లు చెప్పే మా ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణలో మంచి ప్రయోగాలను సిద్ధం చేయగలిగాను. మా పాఠ్యాంశాల్లోని కొన్ని అంశాలను అవగతం చేసుకుని ప్రయోగాలను తీర్చిదిద్దగలిగాను.

– ఎం.మహిమజ్యోతి, తణుకు జెడ్పీ బాలుర హైస్కూలు విద్యార్థిని

ఉపాధ్యాయుల సలహాలే...



ఎలక్ట్రానిక్స్ పరికరాల పనితీరుపై నేను చేసిన ప్రయోగాలు నాకు నచ్చాయి. మా ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాలను ఆచరణలో పెట్టి రూపొందించిన ప్రయోగాలను ఉపాధ్యాయులతోపాటు తోటి విద్యార్థులు కూడా మెచ్చారు.

– టి.ఆదిలక్ష్మి, తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థిని –

ప్రయోగాలను చక్కగా వివరించారు



శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలు ఆలోచింపచేశాయి. పాఠశాలలో ఏడు రోజులపాటు విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను ప్రదర్శనగా ఉంచాం. విద్యార్థులు తమ ప్రయోగాలను వివరించే విధానం చాలా బాగుంది.

– అక్కింశెట్టి రాంబాబు, తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయులు

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



వరద బాధితులకు దుస్తులు అందజేస్తున్న ఏబీఎఫ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): వేలేరుపాడు వరద బాధితులకు సాయం అందజేస్తామని ఆత్మబంధువులు ఫౌండేషన్ (ఏబీఎఫ్) సభ్యులు వెల్లడించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేలూరుపాడు మండలంలోని కమ్మరిపాలెం, కోయ మాధవరం, కోటగుంపు, మేడేపల్లి అల్లూరి నగర్, ఉదయ్‌నగర్, వేలేరుపాడు, రామవరం గ్రామాల్లో సర్వేలు చేశారు. వరదలకు నిరాశ్రయులైన వారికి దుస్తులు, స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శీతాల ఉషాకిరణ్, కడియాల పరశురామయ్య, బుద్దాల వెంకట రామారావు, వెజ్జు దుర్గాప్రసాద్, గీతాంబికా, రెడ్డి సుబ్రహ్మణ్యం, కేవీ చలం, కె.నాగేంద్ర, పేరూరి కాశయ్య, ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

తాడేపల్లిగూడెం (టీటీసీ): బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్, హెచ్‌సీఎల్ కంపెనీ వారి సంయుక్త ఆధ్వర్యంలో 2022–23, 23–24 సంవత్సరాలలో ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు పట్టణంలోని శ్రీ వాసవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఈ ఉద్యోగాలకు ఇంటర్‌లో సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, వృత్తి విద్యా కోర్సుల్లో పాసైన విద్యార్థులు అర్హులని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ వెల్లడించారు. ఆగస్టు 1వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ఉంటుందని, క్యాట్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, ఇంగ్లీషు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉత్తీర్ణత సాధించిన వారికి వృత్తిపరమైన శిక్షణ, 4వ నెల నుంచి రూ. 10,000 స్టైఫండ్ ఇతర సౌకర్యాలు ఉంటాయని వెల్లడించారు.

అందరూ ఐకమత్యంగా మెలగాలి

- ఏ ప్రభుత్వం ఉన్నా అధికారులు పద్ధతిగా మెలగాలి
- సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి
- ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



తణుకు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సమావేశాలకు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు వారి సిబ్బందిని పంపిండం సరికాదని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పేర్కొన్నారు. మంగళవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన తణుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎక్సైజ్ శాఖకు సంబంధించిన ఎస్ఐ కానీ, సీఐ కానీ హాజరు కాకుండా ఒక కానిస్టేబుల్ హాజరై ఆశాఖకు సంబంధించిన వివరాలు చెబుతుండా ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ జోక్యం చేసుకుని గత మూడు నెలల క్రితం జరిగిన సమావేశానికి తాను హాజరయ్యాయని, అప్పుడు కూడా ఎక్సైజ్ శాఖ తరపున ఎవరూ హాజరు కాలేదని తెలిపారు. దీనితో ఎంపీడీవో సంబంధిత ఉన్నతాధికారులను నోటీసులు అందజేయాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో పెండింగ్ సమస్యలు, పూర్తి కాని పనుల వివరాలను తయారు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పేరుకు పోయిన బకాయిలను గ్రామ కార్యదర్శులు వెంటనే వసూలు చేయాలని, వాటి ద్వారానే అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కేఆర్ఎం కిషోర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో గ్రామాల్లో పని చేసే ఏఎన్ఎంలపై పనిబారం పెరిగిపోయిందని, వారిని గ్రామ సచివాలయం, ఎంపీడీవో పరిదిని నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి పరిధిలోకి తీసుకురావాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మండపాక ఎంపీటీసీ సభ్యుడు వేల్పూరు శ్రీనివాస్ మాట్లాడుతూ తమ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు మాత్రమే సబ్జెక్ట్ ఉపాధ్యాయులున్నారని, వీరితో విద్యార్థుల చదువులు ఎలా సాగుతాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దువ్వ ఎంపీటీసీ సభ్యుడు పెనుమాక అశోక్ మాట్లాడుతూ తమ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వర్షం నీరు వస్తే నిలిచిపోయి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతుందని దీనిపై దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీలు ఐశెట్టి శేషుకుమారి, గారపాటి పద్మజ, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు



అత్తిలిలో ఆడికృత్తికా కావడి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అత్తిలి: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో ఆడికృత్తికా కావడి ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. 20 రోజుల పాటు సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి మాలధారణ చేసిన భక్తులు పాల కావడిలు భుజాన ఉంచుకుని గ్రామోత్సవాన్ని జరిపారు. కేరళ డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. స్వామివారికి ఇరుముడులు సమర్పించారు. ఆలయ అర్చకులు ఐలూరి శ్రీరామం, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాన్ని నిర్వహించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆడి కృత్తికా కావడి ఉత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాలకావిడిని భుజాన వేసుకుని స్వామివారికి సమర్పించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రాధాకృష్ణను ఆలయ కమిటీ తరపున సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు కురెళ్ల ఉమామహేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు, మాజీ ఎంపీపీ కేతా సత్యనారాయణ, దాసం బాబ్జి, కాసగాని హనుమంతు, పోలిశెట్టి రంగారావు, దిరిశాల భీమరాజు, పుప్పాల అర్జునరావు, ఆల్తి సత్యనారాయణ, కొరిపల్లి హరి, బోడపాటి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అత్తిలి: పెదపాడులో బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



తణుకు టౌన్: మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అత్తిలి: మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం బల్లిపాడు శివారు పెదపాడులో లైంగిక వేధింపుల నిషేధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యానేరమని, బాల్యవివాహాలు చేసినవారిపై కఠిన శిక్షలు విధిస్తారని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సిహెచ్ రామలలిత, డి నర్సవేణి, సిహెచ్ శివసత్యవతి, బి నిర్మలకుమారి, మహిళా సంరక్షణ కార్యదర్శి స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరవల్లిలో...

బాల్యవివాహాలు జరగకుండా ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వీఎల్ఎన్ కుమా రి, ఎస్ విజయ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గుర్తి చేస్తే చర్యలు

తణుకు టౌన్: బాలికలకు 18 ఏళ్లు నిండికుండా వివాహాలు చేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మీ చెప్పారు. తణుకు మండలం దువ్వ గ్రామంలోని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు పని చేసే ప్రదేశాల్లో జరిగే వేధింపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఏపీఎస్ఎఫ్‌సీ ఏలూరు బ్రాంచ్ మేనేజర్ స్వరూపారావు

తాడేపల్లిగూడెం రూరల్: యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌సీ) ఏలూరు బ్రాంచ్ మేనేజర్ స్వరూపారావు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపారావు మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి తమ సంస్థ రూ.10లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. రూ.2లక్షల లోపు వ్యయమయ్యే చిన్న వ్యాపార సంస్థలకు కొన్ని ప్రభుత్వ బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. అప్పటికే నెలకొల్పిన షాపుల్లో నూతన వ్యాపారాలను ప్రారంభించడం వల్ల తక్కువ ఖర్చు అవుతుందన్నారు. కొత్త షాపులను నెలకొల్పవలసిన అవసరం ఉండదన్నారు. ఏపీఎస్ఎఫ్‌సీ సంస్థ అందజేస్తున్న రుణ సదుపాయాలను వినియోగించుకుని, అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ వై.సూర్యప్రకాష్, డిప్యూటీ మేనేజర్లు డి.పుష్ప, వై.క్రాంతికుమార్, ఔత్సాహికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు నాగబుజ్జి అన్నారు. పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకుని కుంచనపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద రెవెన్యూ అధికారి ప్రభు కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. సాంఘీకశాఖ అధికారి రాజు, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, వీఆర్ఓ అప్పారావు, పంచాయతీ సెక్రటరీ బ్రహ్మం తదితరులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సచివాలయం సిబ్బంది, దళితులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



ఈఆర్ఓ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీటీసీ): విద్యుత్ శాఖలో కీలకమైన ఈఆర్వో వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా ఏపీఈపీడీసీఎల్ మేనేజ్‌మెంట్ కార్యాచరణ చేస్తుందని తాడేపల్లిగూడెం విద్యుత్ శాఖ అకౌంటింగ్ సిబ్బంది విమర్శించారు. జువ్వలపాలెంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రిడెవలప్‌మెంట్ పేరుతో ఈఆర్వో విభాగాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఏపీ ట్రాన్స్‌కో ఆదేశాలకు సంబంధం లేకుండా ఏపీఈపీడీసీఎల్ సీఎండీ తనకు నచ్చిన విధంగా ఉత్తర్వులను జారీ చేసుకుంటూ వినియోగదారులకు ఈఆర్వో విభాగం అందించే నాణ్యమైన సేవలను దూరం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈఆర్వోల్లో ఉన్న వసతులను కాదని కనీస సౌకర్యాలు లేని సెక్షన్ ఆఫీస్‌కు సిబ్బందిని తరలిస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన రిడెవలప్‌మెంట్ పూర్తిగా నిర్వీర్యం అయిపోయి, సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో విద్యుత్ అకౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ఆషాఢం సారె



ముత్యాలమ్మకు ఆషాఢం సారె సమర్పిస్తున్న భక్తులు

పెంటపాడు: మండలంలోని ముత్యాలమ్మ అమ్మవారికి అషాఢం సారె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. అధిక సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారికి సారె, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు, 18 రకాల పిండివంటల కావిళ్లతో ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి భాస్కరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

తణుకు టౌన్: వినియోగదారుల హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు జీఎస్ఆర్ శంకర్ చెప్పారు. మంగళవారం తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వినియోగదారుల క్లబ్ అధ్యక్షురాలు జీ ఇందిరా కుమారి అధ్యక్షతన వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కేఆర్ ఫణిధర్, ఏ మారుతీదేవి చౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐవీ నారాయణ, రాజశేఖర్, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): దంత సమస్యలు రాకుండా చిన్ననాటి నుంచి రెండు పూటల బ్రష్ చేసుకోవాలని లయన్స్‌క్లబ్ డైమండ్స్ జిల్లా చైర్మన్ డీసీఎస్‌వీ రమణారావు అన్నారు. స్థానిక సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన స్మైల్ మల్టీస్పెషల్టీ ఆసుపత్రి ఆధ్వర్యంలో 200మంది విద్యార్థులు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ గోపికృష్ణ, పి.గురుస్వామి, ములగాల జితేంద్ర కుమార్, చిక్కాల అంబిక, సుభద్ర, అయ్యప్ప రామరాజు తదితరులు పాల్గొన్నారు.